క్లుప్తంగా

సీడీపీఓ ఆకస్మిక తనిఖీ

కోడేరు: మండల కేంద్రంలోని 1వ అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం సీడీపీఓ వెంకటరణమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు సక్రమంగా పౌష్టికాహారం అందివ్వాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో లక్ష్మి, హైమావతి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నాస్ పరీక్షలు



లింగాల: మండలం కేంద్రంలో బుధవారం 3వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన 'నాస్' పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పరీక్షల నిర్వహణకు బాలికల మినీ గురుకుల పాఠశాల, సెయింట్ పీటర్స్ పాఠశాలలో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ బషీర్ అహ్మద్ తెలిపారు. ఒక్కో కేంద్రంలో 30 మంది విద్యార్థుల చొప్పున మొత్తం 60 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఆయా పరీక్షల కేంద్రాలను ఏఈఓ తనిఖీ చేశారు. ఇబ్రహీం, హనుమంతులు పర్యవేక్షించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆన్‌లైన్ నమోదు



పెద్దకొత్తపల్లి: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఫామ్స్ డేటా నమోదు ఎంపీడీఓ కార్యాలయంలో ముమ్మరంగా కొనసాగుతోంది. మండలంలోని 25 గ్రామ పంచాయతీలలో చేపట్టిన కుటుంబ సర్వేకు సంబంధించిన వివరాలను కంప్యూటర్లలో ఆపరేటర్‌ల ద్వార నమోదు చేయిస్తున్నట్లు ఎంపీడీఓ నాగేందర్ తెలిపారు. ఎలాంటి తప్పులు లేకుండా చూసుకోవాలని సూచించారు.

ఎంపీడీఓకు వినతి



అమ్రాబాద్: మండల కేంద్రంలోని కోదండ రామాలయం భూమి సర్వే నంబర్ 1330లో నిర్మించిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు బుధవారం అమ్రాబాద్ ఎంపీడీఓ వెంకటయ్యకు వినతిపత్రం అందజేశారు. గత నెల 7వ తేదీన రామాలయం భూమి హద్దులు ఏర్పాటు చేశారని, భూమిలో ఉన్న అక్రమ నిర్మాణాలు తొలగించాలని కోరారు. రామాలయం భూమి రక్షణ కమిటీ సభ్యులు శ్రీకాంత్‌గౌడ్, నాగరాజు, ఉమామహేశ్వర దేవస్థాన కమిటీ సభ్యులు తిరుతర్యుగౌడ్, రాజు తదితరులు ఉన్నారు.

బాల్యవివాహాలు చట్ట విరుద్ధం



తెలకపల్లి: బాల్యవివాహాలు చట్ట విరుద్ధమని డాక్టర్ కల్పన, ఏఎన్‌ఎం పద్మ, కోనేరు సంస్థ ఏరియా కోఆర్డినేటర్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండలంలోని చిన్నముద్దునూరు గ్రామ పంచాయతీ వద్ద కోనేరు సంస్థ హెల్త్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో బాల్యవివాహాలు విముక్త భారతం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసుకుంటే కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ సోషల్ మొబులైజర్ రజిత, నిరంజన్, జానకిరాం, రాణి, మహాదేవమ్మ, బంగారయ్య, నర్సింహారెడ్డి, వేమురెడ్డి, లక్ష్మమ్మ, బాలస్వామి పాల్గొన్నారు.

డీఈఓకు సన్మానం

నాగర్‌కర్నూల్‌రూరల్: ఇటీవల బదిలీపై వచ్చిన డీఈఓ రమేష్‌కుమార్‌ను బీసీ సంఘం నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ సంఘం నాయకులు కాళ్ల నిరంజన్, చారి తదితరులు శాలువా, పూలబొకేతో సన్మానించారు. జిల్లాలో అన్ని పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీలు వేయాలని కోరారు.

పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యం

నాగర్‌కర్నూల్ క్రైం: పోలీసుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్ స్థలంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్మించిన పెట్రోల్ బంక్‌ను బుధవారం ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, సికింద్రాబాద్ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ డీఎం సుదీప్త మిశ్రా, అదనపు ఎస్పీలతో కలిసి కలెక్టర్ బాదావత్ సంతోష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాణ్యమైన ఇంధనాన్ని సరఫరా చేయాలని కోరారు. జిల్లా పోలీసుల సంక్షేమానికి ఎస్పీ అవసరమైన నిధులను వనరులను సమకూరుస్తున్నారని కొనియాడారు. అదనపు ఎస్పీ భరత్ కుమార్, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

ఉపాధిహామీ పనులు పరిశీలన



మంచాలకట్టలో ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న ఇంటర్నల్ ఆడిట్ టీం

పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్, మంచాలకట్ట గ్రామాల్లో ఇంటర్నల్ ఆడిట్ టీం లీడర్ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో సభ్యులు బుధవారం ఆయా గ్రామాలను సందర్శించారు. ఇందులో భాగంగా ఇరిగేషన్ షెడ్స్, స్మశాన వాటిక, అవెన్యూ ప్లాంటేషన్, సీసీటీలు, నర్సరీలు, సీసీ రోడ్లు, డీపీవీలు, టీపీవీలను ఇంటర్నల్ ఆడిట్ సభ్యులు పరిశీలించారు. అనంతరం ఆడిట్ అధికారులు మాట్లాడుతూ ఉపాదిహామీ పథకం కమిషనర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో పలు పనులను పరిశీలించి తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. ఏపీడీ చంద్రశేఖర్, అడిషనల్ డీఆర్‌డీఓ రాజేశ్వరి, ఎంపీడీఓ చంద్రశేఖర్, రాజేశ్వరి, నవీన్‌కుమార్, ఎంపీడీఓ దేవేందర్, ఏపీఓ మోహన్‌కృష్ణ, జగదీష్ పాల్గొన్నారు.

అంధత్వ నియంత్రణ సామాజిక బాధ్యత

బల్మూర్: అంధత్వ నియంత్రణ అందరి బాధ్యత అని ప్రిన్సిపాల్ డి.సైదులు కోరారు. మండలంలోని కొండనాగుల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా ఇందులో ఆరు మందికి కంటిలోపాలు ఉన్నట్లు గుర్తించినట్లు అప్తాలమిక్ గణేష్ తెలిపారు. కంటి లోపం ఉన్న వారికి ఉచితంగా కంటి అద్దాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు శేఖర్, శోభారాణి, అనిత, శైలజ, ఆంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

తప్పుడు ఆరోపణలు సరికాదు

బల్మూర్: మండలంలోని మైలారంలో వారం రోజుల కిందట ఇద్దరి మధ్య జరిగిన గొడవ విషయంలో ఒకరిపై ఒకరు పోలీసు స్టేషన్ లో కేసులు పెట్టుకుంటే తమపై తప్పుడు ఆరోపణలు చేయడం సరైనది కాదని మైనింగ్ ప్రాజెక్టు మెనేజర్ వేణుగోపాలు బుధవారం ప్రకటనలో కోరారు. గుట్టపై తవ్వకాలను అడ్డుకోవడం వల్లనే కేసు నమోదు చేయించి జైలుకు పంపించారని పేర్కొనడం సరికాదని తెలిపారు. ప్రజా సంఘాల వారు నిజాలను తెలుసుకొని మాట్లాడాలని కోరారు. అన్ని అనుమతులతోనే ప్రాజెక్టు పనులు నిర్వహిస్తునట్లు తెలిపారు. అసత్య ప్రచారాలు మానుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు సన్మానం



చారకొండ: మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన షేక్ ముస్తఫా బుధవారం కల్వకుర్తి కమిటీ డైరెక్టర్‌గా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం జూపల్లిలో ఆయన నివాసంలో భగత్‌సింగ్ యువజన సంఘం ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో భగత్‌సింగ్ యువజన సంఘం సభ్యులు, రాజు యాదవ్, కార్తిక్, చంద్రశేఖర్, శ్రీకాంత్, అల్లాజీ, మల్లికార్జున్, పవన్ గౌడ్, శ్రీకాంత్, అనంద్, జంగయ్య గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

భూమి కేటాయించాలని వినతి



నాగర్‌కర్నూల్‌రూరల్: విజ్వల్ రీసెర్చ్ ఎడ్యుకేషన్ సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం భూమిని కేటాయించాలని విజ్ఞప్తి చేస్తూ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డితో కలిసి జిల్లా కేంద్రానికి చెందిన బసవోజు దేవేంద్రాచారి బుధవారం కలెక్టర్ బదావత్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. 2015 నుంచి 2019 వరకు జాతీయ విద్యా విధానంలో తీసుకురావాల్సిన మార్పులపై వీఆర్‌సెర్చ్ ఎడ్యుకేషన్ పేరుతో దేశ వ్యాప్తంగా ఆవిష్కరణలు చేసినట్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

బ్యాంకు సేవలు వినియోగించుకోవాలి



తాడూరు: బ్యాంకు సేవలను వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలని ఏపీజీవీవీ మేనేజర్ గోన్మయి అన్నారు. బుధవారం గ్రామీణ బ్యాంకు ఆవరణలో నిర్వహించిన కళాజాతా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. 2025 జనవరి నుంచి ఏపీజీవీవీ ఇక తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా పరిగణించబడుతుందన్నారు. డిసెంబరు 28 నుంచి 31 వరకు మూడు రోజుల పాటు బ్యాంకు సేవలకు కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఆటంకం ఏర్పడుతుందని వినియోగదారులు గమనించి సహకరించాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది చైతన్య నాయక్, అజిత్, దయాకర్, వెంకటేశ్ కళజాతా బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్రంలోని అన్ని జిల్లాల వారిగా ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని మాదిగ జేఏసీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ వంగూరు జయశంకర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం జెడ్పీ గ్రౌండ్‌లో ఎస్సీ వర్గీకరణ అంశంపై ఇచ్చిన కోర్టు తీర్పు పత్రాలను కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నియోజకవర్గ నాయకులు బోడ సురేందర్, వినోద్, అంతటి హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం దగ్ధం

నాగర్‌కర్నూల్ క్రైం: గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనానికి నిప్పంటించిన ఘటన మండలంలోని శ్రీపురంలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం శ్రీపురం గ్రామానికి చెందిన మల్లేష్ తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు నిలిపి ఉంచగా గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనానికి నిప్పంటించడంతో పూర్తిగా కాలిపోయింది. బుధవారం బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వన్యప్రాణులను సంరక్షిద్దాం

అచ్చంపేట రూరల్: అడవుల్లో వన్యప్రాణులను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని డీఎఫ్‌ఓ రోహిత్ గోపిడి అన్నారు. వన్యప్రాణుల సంరక్షణ దినోత్సవం సందర్భంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. అంతేకాకుండా ఫారెస్ట్ సఫారీ క్షేత్ర పర్యటనకు తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఉపాధ్యాయబృందం పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న డీఎఫ్‌ఓ రోహిత్

ఎమ్మెల్యేకు సన్మానం



మన్ననూర్: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నియమించిన వన్యప్రాణి సంరక్షణ బోర్డు సభ్యుడుగా ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఎంపికైన సందర్భంగా పలువురు నాయకులు, ఉద్యోగులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ఓ ప్రత్యేక కార్యక్రమానికి విచ్చేసిన ఆయనను అటవీశాఖ విశ్రాంతి గృహంలో వారు కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో లాల్‌సింగ్, భాస్కర్, దివాకర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, ఎంఏ రహీం, శ్రీనివాసులు, హన్మంత్ రెడ్డి, రాజారాం, శివాజీ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



చారకొండ: మండల కేంద్రానికి చెందిన రజిత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న శివకుమార్ ఫౌండేషన్ చైర్మన్ లావణ్య గౌడ్ బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో ఐల రమేష్ గౌడ్, బీజేపీ నాయకులు ప్రవీణ్, అనిల్, రఘు, కిరణ్ తదితరులు ఉన్నారు.

నిందితులకు రిమాండ్



కోడేరు: మండల కేంద్రంలోని ఉమామహేశ్వర ఆలయం వెనక భాగంలో ఉన్న పురాతన వినాయక విగ్రహం గత నెల 26న గుర్తు తెలియని వ్యక్తులు విగ్రహాన్ని ధ్వంసం చేసిట ఘటన విధితమే. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బుధవారం దీనికి సంబంధించిన వివరాలను మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాసులు ఎస్‌ఐ గోరారితో కలిసి వెల్లడించారు. నిందితులను సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకొని కర్నాటకకు చెందిన మహబూబ్‌పాషా, ఉస్సేన్‌భాషా, ఉస్మాన్‌లను నిందితులుగా గుర్తించి ఇద్దరిని అదుపులోకి తీసుకోగా మరొకరు పరారైనట్లు తెలిపారు. నిందితులను పోలీసుస్టేషన్‌కు తరలించి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నేరస్తులు ఉపయోగించిన వాహనం, సుత్తెను సీజ్ చేశామన్నారు. పరారీలో ఉన్న వ్యక్తిని త్వరలో పట్టుకుంటామని ఆయన తెలిపారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా జైపాల్

చారకొండ: మండలంలోని తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన నాయిని జైపాల్ జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జైపాల్ మాట్లాడుతూ ఎన్నికల్లో అవకాశం ఇచ్చి, సహకరించిన అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికోసం నిరంతరం పాటుపడతానని పేర్కొన్నారు.

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా..

అమ్రాబాద్: పదర మండల యూత్ కాంగ్రెస్ యువజన మండల అధ్యక్షుడిగా బుధవారం వంకేశ్వరం గ్రామానికి చెందిన వడ్లాల హరికృష్ణ నియామకం అయ్యారు. ఈ సందర్భంగా అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

ట్రైమోటార్ సైకిల్ అందజేత

చిన్నంబావి: మండలంలోని లక్ష్మీపల్లికి చెందిన మానపాడు శ్రీదేవికి కాళ్లు సరిగా లేక భూమిని పట్టుకొని నడుస్తుండంటంతో ఆమెను చూసి చలించిన జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కృష్ణప్రసాద్ యాదవ్ తన మిత్రుడు రేమొద్దుల ఖతాల్ సహకారంతో మూడు చక్రాల మోటార్ సైకిల్‌ను అందించారు.

కాంగ్రెస్ పాలనలో గురుకులాలు నిర్వీర్యం

నాగర్‌కర్నూల్‌రూరల్: కాంగ్రెస్ పాలనలో గురుకులాలు నిర్వీర్యం అవుతున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పన అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ మండలంలోని బీసీ గురుకుల పాఠశాలను బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు పాఠశాలను సందర్శించారు. గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి ఆదేశానుసారం పాఠశాలను సందర్శించి పాఠశాలలో వంటలను పరిశీలించినట్లు బీఆర్‌ఎస్‌ఈ నాయకులు విష్ణుసాగర్ తెలిపారు. వంటశాలలో నాణ్యత లేని పాయసం చూసి నిర్వాహకులను ప్రశ్నించారు. అనుమతి లేకుండా గురుకుల పాఠశాలకు రావడంతో ఈ సందర్భంగా బీఆర్‌ఎస్, బీఆర్‌ఎస్‌ఈ నాయకుల, పోలీసుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. అనంతరం బీఆర్‌ఎస్‌ఈ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో భాస్కర్‌గౌడ్, వైస్ చైర్మన్ బాబురావు, కౌన్సిలర్లు తేజ, సురేందర్‌రెడ్డి, విజయమ్మ, సుమలత, తదితరులు పాల్గొన్నారు.



భోజనాన్ని పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్‌ఈ నాయకులు

మాజీ ముఖ్యమంత్రి రోశయ్యకు నివాళి

తెలకపల్లి: దివంగత మాజీ ముఖ్యమంత్రి కొనిదేటి రోశయ్య వర్ధంతిని బుధవారం మండల కేంద్రంలోని నెహ్రూ చౌరస్తాలో రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఓ మహిళకు కుట్టు మిషన్ అందజేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, కాంగ్రెస్ మైనార్టీ నాయకులు ఎండీ కుర్షిద్, ఎండీ ఫరీద్, లక్ష్మన్, బాలస్వామి, శారద, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి, శ్రీనివాసులు, రంగయ్య, విజయ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి రోశయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ విద్యాకమిటీ చైర్మన్ మిడ్డిదొడ్డి శ్యాంసుందర్, నాగర్‌కర్నూల్ జిల్లా బచ్చు రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కల్మిచర్ల రమేష్, మండల అధ్యక్షుడు ఆంజనేయులు, సురేష్, నాయకులు వజ్రలింగం, రాజయ్య, కుమారస్వామి, శివ, శ్రీనివాస్, కిరణ్, శ్రీనివాస్, పాండు తదితరులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలు

లింగాల: మండలంలోని అంబట్‌పల్లి పబ్బతి ఆంజనేయ స్వామి దేవాలయంలో శివలింగం, నంది, సీతారాములు, శ్రీకృష్ణ విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు ప్రతిష్ఠాపన కార్యక్రమాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య మొదటి రోజు విఘ్నేశ్వర పూజ, పుణ్యావాచనం, అంకురార్పణ, యాగశాల ప్రవేశం, రక్షాబంధనం, నవగ్రహ, వాస్తు, సర్వతోభద్ర మండల పూజ, ఆరాధనలు, రుత్విగ్వరణ, జలాధివాసం, హోమాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. రెండోరోజు గురువారం జంబయంత్ర శుద్ధి, అభిషేకాలు, గణపతి, నవగ్రహ, వాస్తు హోమాలు, మహాస్నపనం, ధాన్యదివాసం, అధిదాసాంగ హోమాలు తదితర పూజలు నిర్వహిస్తుట్లు నిర్వాహకులు తెలిపారు.

పాడిఆవులను రక్షించుకోవాలి

వెల్దండ: పాడిఆవులకు సోకుతున్న సీజనల్ వ్యాధుల నుంచి సకాలంలో పశువులకు టీకాలు వేయించి పశువులను కాపాడుకోవాలని డాక్టర్ శ్యాంసుందర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని భర్కత్‌పల్లి, చొక్కన్నపల్లి, బండోనిపల్లి గ్రామాల్లో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాడి పశువులకు ఎద సమస్య, గర్భకోశ సమస్యలను పరీక్షించారు. అనంతరం రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు ప్రవీణ్, ప్రశాంత్‌రెడ్డి, రామ్‌సింగ్, లక్ష్మీ, విజయడైరీ మేనేజర్ ప్రియాంక, శశిధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

సర్వే ఫారాలు పరిశీలన



తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఇటీవల నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలను బుధవారం సూపర్‌వైజర్లు శ్రీనీవాస్ రెడ్డి, శ్రీనివాసులు గ్రామాల వారీగా పరిశీలించారు. ఎలాంటి తప్పులు ఉన్న సరిచేసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. 96 శాతం ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తయ్యిందని పేర్కొన్నారు.

వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కొల్లాపూర్ రూరల్: మండలంలోని తాళ్ల నర్సింహ్మాపురంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్య, సింగిల్ విండో చైర్మన్ పెబ్బేటి కృష్ణయ్యలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని రైతులు వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మకాలు చేయాలని తెలిపారు. ప్రభుత్వం సన్నవడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తుందన్నారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మహముదా బేగం, సింగిల్ విండో డైరెక్టర్లు తాళ్ల పరశురాముడు, నరసింహా పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పూజ



వెల్దండ: మండల కేంద్రంలోని యెన్నమ్మ్స ఆస్పత్రి ఆవరణంలో డాక్టర్ హరికాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం అయ్యప్పస్వాములు పడిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు, మాజీ ఎమ్మెల్యే వంశీచందర్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. అనంతరం స్వాములకు అన్నదానం చేశారు. గురుస్వాములు, నాయకులు తదితరులు ఉన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి దాతలు విరాళాలు అందిస్తున్నారని ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి అన్నారు. బుధవారం ఆలయంలో కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పండిత్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిత్యాన్నదానం కోసం రూ. 25వేలు విరాళంగా ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసరావు, సిబ్బంది రామకృష్ణ, సతీష్, ఆలయ ప్రధాన అర్చకుడు వీరయ్యశాస్త్రి పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు దొందు దొందే

నాగర్‌కర్నూల్‌రూరల్: కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు దొందు దొందేనని బీజేపీ జిల్లా నాయకులు రాజవర్ధన్ రెడ్డి, కోల్‌దాసు రాము విమర్శించారు. బుధవారం స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో కాంగ్రెస్ పాలన వైఫల్యాలపై చార్జ్‌షీట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలు 420 హామీల అమలులో పూర్తిగా వైఫల్యం అయ్యిందన్నారు. గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో అవినీతికి పాల్పడిందని ప్రస్తుత కాంగ్రెస్ మూసి ప్రాజెక్ట్ పేరుతో దోచుకునే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. సుధాకర్‌రెడ్డి, నాగేంద్రంగౌడ్, కడారి కృష్ణ, శ్రీరాములు, బాలస్వామి, ఆంజనేయులు, సత్యనారాయణ, రాము పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఆశావర్కర్ల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలు

నాగర్‌కర్నూల్‌రూరల్: పెండింగ్‌లో ఉన్న డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఆశావర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ 2024లో రాష్ట్ర వ్యాప్తంగా ఆశావర్కర్లు పనిచేసిన డబ్బులు ఇవ్వకుండా మళ్లీ కొత్త సర్వేలు చేయ్యమని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తక్షణమే పల్స్‌పోలియో డబ్బులను ఆశలకు చెల్లించాలన్నారు. 6 నెలల కరోనా రిస్క్ అలవెన్స్‌ను చెల్లించకుండా వచ్చిన డబ్బులను అధికారులు పక్కదారి పట్టించారని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు, నాయకులు పొదిల రామయ్య, కొంపల్లి అశోక్, కళావతి, చెన్నమ్మ, స్వప్న, శ్రీదేవి, వసుంధర, శకుంతల తదితరులు పాల్గొన్నారు.